క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాచర్ల: మాచర్ల సబ్ డివిజన్ పరిధిలో పట్టణ, మాచర్ల రూరల్, దుర్గి, వెల్దుర్తి మండలాల్లో నేడు శనివారం సబ్ స్టేషన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 9గం॥ల నుంచి మధ్యాహ్నం 2గం॥ల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ ఎ రామయ్య తెలిపారు. నాలుగు మండలాల విద్యుత్ వినియోగదారులు తెలుసుకుని, విద్యుత్ సంస్థకు సహకరించాలని ఆయన కోరారు.

కాపు జేఏసీ మండల అధ్యక్షుడిగా రవిబాబు

గురజాల : కాపు జేఏసీ మండల అధ్యక్షుడిగా జక్కా రవిబాబును నియమిస్తూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కురియాల ఉదయభాస్కర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు అమ్మ శ్రీనివాస నాయుడు ఆదేశాల మేరకు నియమించడం జరిగిందన్నారు. కాపు జేఏసీ అభివృద్ధికి తన వంతు కృషి చేయాలన్నారు. కాపు జేఏసీ అధ్యక్షుడిగా రవిబాబు నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పీఆర్ డీఈగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరెడ్డి

మాచర్ల: నియోజక వర్గ పంచాయతీరాజ్ (పిఆర్) డీఈగా పాశం శ్రీనివాసరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి తను బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ప్రభుత్వ విప్ పీఆర్కే డీఈ శ్రీనివాసరెడ్డిని అభినందించి గ్రామీణ ప్రాంతంలో అన్నీ పనులు సక్రమంగా చేపట్టే విధంగా చర్యలు తీసుకుని ఎప్పటిలాగానే సమర్ధవంతంగా విధులు నిర్వహించాలన్నారు. వెల్దుర్తి మండల పీఆర్ ఏఈగా పనిచేసిన పాశం శ్రీనివాసరెడ్డి పదోన్నతిపై మాచర్ల పీఆర్డీఈగా బాధ్యతలు స్వీకరించారు. ఈయనను పలువురు అభినందించారు.

చర్లగుడిపాడులో పొలంబడి

గురజాల : మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో అడపాల నారాయణ పొలంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి ఎం సంధ్యారాణీ మాట్లాడుతూ పొలంబడి క్షేత్రాన్ని సమగ్ర సస్యరక్షణ క్షేత్రం ప్రయోగ క్షేత్రంలో రైతు వారి పద్ధతిగా విభజించడం జరిగిందన్నారు. పొలంబడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని పంటల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ క్రాప్ గురించి వివరించారు. ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవడం వల్ల కలుగు లాభాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై పూరిల్లు దగ్ధం

మాచవరం: గ్యాస్ లీకై పూరి గుడిసె దగ్ధమైన ఘటన మండలంలోని కొత్త గణేశునిపాడు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన మన్నూరి తిరుపతమ్మ వంట చేసుకునేందుకు గ్యాస్ పొయ్యి వెలిగించగా, గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. పూరి గుడిసెకు మంటలు అంటుకోవడంతో భయాందోళనతో ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీసింది. ఒక్కసారిగా మంటలు పెద్దగా చెలరేగడంతో ఇంట్లోని సామాన్లు అన్ని కాలి బూడిదయ్యాయి. మంటల వేడికి గ్యాస్ సిలండర్ పేలిపోయింది. ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ ఎస్.కోటయ్య పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంగమ్మ గుడి బాట అభివృద్ధి పనులు



కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో గంగమ్మ గుడి మీదగా ఆ ప్రాంత పంట పొలాలకు వెళ్లే బాటను శుక్రవారం అభివృద్ధి చేశారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు ఇరికెదిండ్ల లాజర్ సొంత డబ్బు ఖర్చు పెట్టి ఆ ప్రాంత రైతుల సహకారంతో బాట నిర్మాణం చేయించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పంపిన యంత్ర సామగ్రితో పాటు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సహకారంతో గ్రామ రైతులు పొలం బాటలను అభివృద్ధి చేసుకుంటున్నారు. ఈ క్రమంలో గ్రామ యాదువుల కోరిక మేరకు లాజర్ ప్రత్యేక చొరవతో గంగమ్మ తల్లి గుడికి వెళ్లే బాటను అభివృద్ధి చేశారు. దీంతో యాదవులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కాటా శ్రీనివాసరావు,కూరాకుల మల్లిఖార్జునరావు రైతులు బాట అభివృద్ధి పనుల్లో పాలుపంచుకున్నారు.

పంట నమోదు పూర్తి చేయాలి

చిలకలూరిపేటటౌన్: ఈ పంట నమోదులో నూతనంగా ఈ సంవత్సం నుంచి జియో పెన్సింగ్ విధానం అమలు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి చెప్పారు. శుక్రవారం మండలంలోని కావూరు గ్రామంలో ఆర్బీకె కార్యాలయంలో పంట నమోదు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఏఏలు అందరు నిర్ణేత సమయం లోపు ఖచ్చితంగా ఈ పంట నమోదు ను పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీలత, వ్యవసాయ విస్తరణ అధికారి జీపీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేద ప్రజల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్నాడని ప్రజా సంక్షేమం ద్వారా పేద ప్రజల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పట్లవీడు గ్రామ సచివాలయ పరిధిలోని శివలింగాపురం గ్రామంలో నాల్గవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి గిరిజనులపై అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. మండాది నుంచి యర్రబాలెం గ్రామంలోని ఆరు కి.మీ.ల తారు రోడ్డును రూ. 2.89 కోట్లతో నిర్మించడం జరిగిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల, మత, రాజకీయాలతో పనిలేకుండా అన్నీ వర్గాలు అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతోనే వైఎస్సార్ సీపీ పనిచేస్తోందన్నారు. ఎవరూ అసంతృప్తి చెందకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి మేలు చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమ నిర్వహణ విజయవంతంగా సీఎం జగన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు...

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజల బాధలను తెలుసుకునేందుకు మరింత ముందుకెళ్ళే కార్యక్రమంలో భాగంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామానికి రూ. 11.45 కోట్ల సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాయంకుల గోపాల్, కండ్లకుంట సొసైటీ అధ్యక్షుడు తాడికొండ పుల్లారెడ్డి, గ్రామ సర్పంచ్ చల్లా శ్రీనివాసరావు, ఆధ్వర్యంలో కార్యక్రమంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని పలుచోట్ల ప్రజలనుద్దేశించి మాట్లాడారు. శివలింగాపురం గ్రామంలోని 80 గృహలలోని లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి బాటలు వేస్తూ ప్రతిరోజూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూములకు రైతు భరోసా పథకం ద్వారా రూ. 13500లు ప్రతి ఏటా అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 87% కుటుంబాలకు లబ్ధి చేకూర్చిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో అత్యంత ప్రజాదరణ కలిగిన ముఖ్యమంత్రిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. పేద ప్రజలకు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల దేశంలో 5వ స్థానంలో నిలిచారన్నారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక, విదేశీ విద్య, అమ్మ ఒడి వంటి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, మండల పరిషత్ అధ్యక్షుడు చింతా శివరామయ్య, జెడ్పీటీసీ రూప్లీ బాలునాయక్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాయంకుల గోపాల్, మాజీ సర్పంచ్‌లు కోనుగుంట శ్రీనివాస రెడ్డి, గుండెబోయిన నాగేశ్వరరావు, మండల పరిషత్ మాజీ అధ్యక్షులు చల్లా పిచ్చయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా అంజి, చౌదయ్య, రాయపాటి హనుమంతరావు, ఏలూరి శ్రీనివాసరావు, మేకల కోటిరెడ్డి, ఎంపీడీఓ డి ప్రసాద్, విఆర్ఎఈ శ్రీనివాస రెడ్డి, బాలబోయిన చంద్రశేఖర్, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహ సారథులు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

నేల తల్లికి వందనం, వీరులకు వందనం



మొక్కలు నాటుతున్న రోటరీ క్లబ్ సభ్యులు, జూనియర్ కళాశాల డైరెక్టర్లు



తుమ్మకోట కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, సర్పంచ్ నల బాలునాయక్



వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నా భూమి నా దేశం శిలాఫలకం



అజాదికా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నేతలు



మొక్కలు నాటుతున్న అధికారులు



మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ కోటేశ్వరరావు, ఎంఈఓ నాగయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు

వెల్దుర్తి: కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర సీఎం జగన్ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నా భూమి నా దేశం శిలాఫలకాన్ని ఎంపీడీఓ వి ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75సం॥రాలైన సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆజాదీకా అమృత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆరు గ్రామాల్లో శిలాఫలకాలతో పాటు 75 మొక్కలను నాటడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ మన జీవితంలో ఉన్న ప్రతి నిమిషం, మన శరీరంలోని సర్వ శక్తిని భరతమాతకు అంకితం చేయటమే మన స్వాతంత్ర సమరయోధులకు ఇచ్చే ఘనమైన నివాళి అని కొనియాడారు. దీనిలో భాగంగా ఎన్ఆర్ఇజిఎస్ అధికారులు, హై స్కూల్ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నేల తల్లికి వందనం, వీరులకు వందనం అని ఎక్స్ ఆర్మీ ఆదిరాల రాజారావు, కాలం కోటిరెడ్డి, అల్లి దేవదానం, చింతమల్ల సాంబయ్యలని పూల మాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి వందనం కార్యక్రమం జరిగింది. పాఠశాల విద్యార్థులు రౌండ్‌గా నిలబడి నేలతల్లికి వందనం అంటూ నినాదాలు చేస్తూ భరతమాతకు వందన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కేసిరెడ్డి పిచ్చిరెడ్డి, పాపిరెడ్డి, పులుసు నారాయణరెడ్డి, కేసిరెడ్డి నాగిరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి

మాచర్ల: డెబ్బై ఐదవ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నా తల్లి నా భూమి నమస్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పల్నాడు, ప్రతిభ జూనియర్ కాలేజీ, రోటరీ క్లబ్‌ల ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కళాశాల విద్యార్థులు, కార్యవర్గ సభ్యులు, నియోజక వర్గ ప్రభుత్వాసుపత్రి వర్కింగ్ ప్రెసిడెంట్ రామకోటయ్య ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు చిన్ని సత్యనారాయణ, పఠాన్ నాగుర్‌వలి, కోశాధికారి పందిరి నరసింహారావు మాట్లాడుతూ స్వాతంత్ర వేడుకల సందర్భంగా విద్యార్థులను చైతన్య పరుస్తూ ప్రభుత్వ సంస్థల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి వర్కింగ్ ప్రెసిడెంట్ డా. రామకోటయ్య, ప్రభుత్వాసుపత్రి వర్కింగ్ సూపరిండెంట్ డా. ఉదయభాను వైద్యులు మురహరిరావు, సభ్యులు గోనుగుంట్ల రామ్మూర్తి, కేసీపీ వాసు, డ్డా॥ దినేష్, వంశీ, ప్రతిభ, పల్నాడు ప్రోగ్రాం నిర్వహించిన వారు కొమెర కాశి, రబ్బాని, విద్యార్థిని, విద్యార్థులు చెప్పారు.

పలుగ్రామాల్లో 'నా భూమి నా దేశం'

రెంటచింతల: నా భూమి నా దేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. శుక్రవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపి వారి ఆధ్వర్యంలో నా భూమి నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం, ఆజాదిక అమృత్ మహోత్సవ వేడుకల్లో భాగంగా పాలువాయి, తుమ్మకోట గ్రామ సచివాలయాల్లో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో వారు పాల్గొని మొక్కలను నాటి మాట్లాడారు. మండలంలోని గ్రామ సచివాలయాల్లో, పాఠశాలలలో, ప్రభుత్వ కార్యాలయాల్లో, రహదారులకు ఇరువైపుల మొత్తం 1,045 మొక్కలను నాటే కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భావి తరాలకు మంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలని కోరారు. మంచి పచ్చని వాతావరణం వల్ల ప్రజలు పరిపూర్ణమైన ఆరోగ్యంతో ఉంటారన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో మొక్కలను నాటుకోవాలని సూచించారు. అనంతరం వివిధ పాఠశాలల వద్ద శిలాఫలకాలను ఏర్పాటు చేసి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి వారితో మొక్కలను నాటుదాం...పర్యావరణాన్ని కాపాడుకుందాం అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాలలో సర్పంచ్‌లు మందలపు విజయలక్ష్మి లచ్చిరెడ్డి, నల బాలునాయక్, ఈఓపీఆర్డీ సీహెచ్ రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూస్ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఏపిఓ జయచంద్ర, కార్యదర్శిలు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలి

దాచేపల్లి : నగర పంచాయతీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అన్నారు. ఆజాది కా అమృత్ మహోత్సవ్-నా భూమి నా దేశం కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో శుక్రవారం నిర్వహించారు. గురజాల ఆర్డీఓ కె. అద్దయ్య ఆధ్వర్యంలో జాతీయ జెండా ఎగుర వేసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ వి. సత్యనారాయణ, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌భాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో కూడా నా భూమి- నాదేశం కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల కృష్ణకుమారి, మాజీ జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెదహనిమిరెడ్డి, ఎంపీడీఓ శోభారాణి, ఏపీఓ మల్లిఖార్జునరావులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. స్వచ్ఛమైన గాలి, నీరు, సారవంతమైన నేలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని ఎంపీపీ జయశ్రీ అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నెమలికంటి వెంకటచారి, ఎంపీటీసీ పాస వెంకటనాగయ్యలు పాల్గొన్నారు.

దేశ సమగ్రతకు కృషి చేద్దాం

దుర్గి: ఎందరో మహానుభావులు త్యాగాల ఫలితంగా స్వాతంత్రం సాధించామని, దానిని కాపాడుకునే లక్ష్యంగా ప్రతి పౌరుడు కృషి చేయాలని ఎంపీపీ ఏసూరి సాయి శంకర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కంచరగుంట గ్రామంలో నిర్వహించిన నా భూమి నా దేశం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశ సమగ్రతకు, ఐక్యతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. స్వాతంత్ర సమరయోధులు, సైనికులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ స్థానిక సచివాలయం ఆవరణలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం హాజరైన ప్రజా ప్రతినిధులు, ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జాతీయ జెండాని ఆవిష్కరించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డి జీవీఎస్ గుప్తా, సెక్రెటరీ వెంకటరెడ్డి, సర్పంచ్ మాణిక్యరావు, ఎంపీటీసి బొంత కృష్ణ, వైఎస్సార్ సీపీ నాకులు మాదాసు వాసు, భిక్షమయ్య, శ్రీరామమూర్తి, భోజ్యానాయక్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గురజాల : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య అన్నారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో నా భూమి - నా దేశం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఎన్నో మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కావూరి అంజిబాబు, సర్పంచ్ బత్తుల ప్రసాద్, డీఎల్‌డీఓ గబ్రూ నాయక్, ఎంపీడీఓ ఆర్ ఫణికుమార్ నాయక్, సెక్రటరీ శివ కోటేశ్వరరావు, పేరుపోగు ముక్కంటి, పోటు సాంబయ్య, తదితరులున్నారు.

అమరవీరుల త్యాగాలను మరువలేం

మాచర్ల రూరల్: అమరవీరుల త్యాగాలు మరువకుండా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి వాటిని సంరక్షిస్తే, వారికి నిజమైన నివాళి అని ఎంపీడీఓ కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని గన్నవరం గ్రామంలో ఆజాదీకా అమృత్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యంలో అసువులు బాసిన వీరులను స్మరించుకుంటూ నా భూమి- నా దేశం , నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం వంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం ఆనందకరమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వేముల నాగయ్య, సర్పంచ్ కందుల శివారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి రమేష్‌నాయక్, పాఠశాల హెచ్ఎం అన్వరఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీఓ మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ



ఏపీ ఎన్‌జీఓ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

పిడుగురాళ్ల: ఏపీ ఎన్‌జీఓ మహాసభలను జయప్రదం చేయాలని ఎన్‌జీఓ నాయకులు శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీఎన్‌జీఓ సంఘం నాయకులు మాట్లాడుతూ ఏపీ ఎన్‌జీఓ మహాసభలు విజయవంతం చేయాలని కమర్షియల్ టాక్స్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సిబ్బంది, అధికారులను కలిసి సభను విజయవంతం చేయాల్సిందిగా కోరడం జరిగిందన్నారు. అలాగే ప్రతి కార్యాలయాన్ని సంప్రదించి ఆగస్టు 21, 22వ తేదీల్లో విజయవాడలో జరిగే మహా సభలను విజయవంతం చేయాలని గోడ పత్రికలు అందించి తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరు అవుతున్నారని తప్పనిసరిగా హాజరు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పట్టాభి, ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు, సాగర్‌బాబు, అన్నారావు, అబ్దుల్ సుకూర్, సొంటిరెడ్డి సైదారెడ్డి, పృధ్వీరాజు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడిన వ్యక్తి నాగిరెడ్డి



నాగిరెడ్డి స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న సెనేట్ సభ్యులు డాక్టర్ రవీంద్రరెడ్డి

దాచేపల్లి : ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి మాజీ ఎమ్మెల్యే మందపాటి నాగిరెడ్డి అని జర్మనీ(పార్లమెంట్) సెనేట్ సభ్యులు డాక్టర్ గుజ్జుల రవీంద్రరెడ్డి అన్నారు. ఇరికేపల్లిలో ఏర్పాటు చేసిన నాగిరెడ్డి స్మారకస్థూపాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. నాగిరెడ్డి చిత్రపటానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నాగార్జునసాగర్ ప్రాజెక్ట్, నడికుడి-బీబీనగర్ బ్రాడ్ గేజ్ నిర్మాణం కోసం నాగిరెడ్డి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం తన గళాన్ని విప్పి సమస్యలు పరిష్కరించేలా పోరాటం చేశారని, ప్రజల కోసం అంకిత భావంతో పనిచేసిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణరెడ్డి, మండలశాఖ కార్యదర్శి కొమెర వెంకట్రావ్, డాక్టర్ కనుమూరి క్రాంతికుమార్, బుర్రి కృష్ణారెడ్డి, కొలా జంపాలరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, వీఆర్వో పత్రా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గోడౌన్ దగ్ధం రూ. లక్ష నష్టం



దగ్ధమైన కిరాణా గోదాము

మాచర్ల: పట్టణంలోని పాత లైబ్రరీ ప్రాంతంలో కిరాణా షాపు నిర్వహించే వారి గోదాము గురువారం రాత్రి 11గం॥ల తరువాత షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. విషయాన్ని తెలుసుకున్న కిరాణా షాపు యజమాని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో వారు రంగంలోకి దిగి విద్యుత్ శాఖకు చెందిన ఏడీఏ రామయ్యకు సమాచారమందించగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అనంతరం ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పి పక్క ఇళ్ళకు ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకున్నారు. మొత్తంగా గోదాము దగ్ధం కారణంగా సుమారు లక్ష రూపాయలు నష్టపోయినట్లు షాపు యజమాని తెలిపారు.

నులిపురుగుల నివారణకు మాత్రలు పంపిణీ



స్కూల్‌లో నులిపురుగుల నివారణ మాత్రలను వేసుకుంటున్న విద్యార్థినులు

మాచర్ల: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో రెండవ రోజు సుద్దగుంతల సచివాలయ పరిధిలో విద్యార్థులకు డా. లక్ష్మీ ప్రసన్న, నర్సు డొక్కా కుమారిలు నులిపురుగుల మందులను అందజేశారు. శుక్రవారం పట్టణంలోని ఆయా పాఠశాలల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నులిపురుగుల మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ విద్యార్థులకు కడుపులోని నులిపురుగుల నివారణ మందులు వేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. విద్యార్థులకు ఆరోగ్యం పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

995 డ్వాక్రా గ్రూపులకు రూ.1.21 కోట్లు జమ



సీఎం వీడియో కాన్ఫరెన్సు ద్వారా వీక్షిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీడీఓ, ఎంఈఓ

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ సున్నావడ్డీ పథకం కింద మండలంలోని 995 డ్వాక్రా గ్రూపులకు చెందిన అక్క చెల్లెమ్మలకు సంబంధించి వారి బ్యాంక్ ఖాతాలకు రూ. 1.21 కోట్లు జమ చేయడం జరిగిందని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి తెలిపారు. శుక్రవారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి ప్రజా ప్రతినిధులు, అధికారులు, డ్వాక్రా అక్క చెల్లెమ్మలు ఆలకించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నవరత్నాలు కార్యక్రమాల అమలులో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను తప్పకుండా 4వ విడత కూడ డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ సున్నావడ్డీ కింద నిధులు విడుదల చేశారన్నారు. దీంతో డ్వాక్రా గ్రూపు సభ్యులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, సీసీలు, విఓఏలు, డ్వాక్రా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

మాచర్ల రూరల్‌లో ..

మాచర్ల రూరల్: దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనటువంటి అక్కచెల్లెమ్మలకు సున్నా వడ్డీ పథకాన్ని అమలు పరుస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీదేనని వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్ ఆరికట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కంభంపాడు గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో సున్నా వడ్డీ పథకాన్ని వీడియో కాన్ఫరెన్సు ద్వారా వీక్షిస్తూ ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సున్నావడ్డీ పథకాన్ని వరుసగా నాలగవ విడత నిధులు విడుదల చేస్తూ మాట తప్పని.. మడమ తిప్పని నేతలుగా వారి కుటుంబానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కోటేశ్వరరావు, ఎంఈఓ వేముల నాగయ్య, కార్యదర్శి బిట్టు వెంకటశ్వర్లు, డ్వాక్రా గ్రూపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

కిరాణా దుకాణంలో చోరీ



దొంగలు పగలగొట్టిన కిరాణా షాపు పైకప్పు రేకులు

నాదెండ్ల: కిరాణా దుకాణంలో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితుడు మూలె భాస్కరరెడ్డి కథనం ప్రకారం గణపవరం నుంచి వేలూరు వెళ్లే డొంక రోడ్డులో హన్విక‌రెడ్డి కిరాణ్ జనరల్ స్టోర్ నడుపుతున్నాడు. రాత్రి 10 గంటల సమయంలో భార్యాభర్తలు ఇరువురూ షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం షాపును తెరివగా పై రేకుల కప్పు తొలగించి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. సుమారు రూ.7 వేల నగదు, కొన్ని కిరాణా సరుకులు చోరీకి గురయ్యాయి. దీనిపై నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి వేళల్లో కొందరు వ్యక్తులు మద్యం తాగుతూ అర్ధరాత్రి సమయంలో చోరీ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

13న మెగా ఉచిత కంటి వైద్యశిబిరం

నాదెండ్ల: మండలంలోని గొరిజవోలు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ నెల 13న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నాదెండ్ల సొసైటీ చైర్మన్, కేవీఆర్ ఫౌండేషన్ అధినేత కురుకుంట్ల వెంకట రెడ్డి చెప్పారు. శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరుగుతుందన్నారు.